క్లుప్తంగా

ప్రవీణ్‌కు మాజీ ఎమ్మెల్యే కైలే పరామర్శ



రాపర్ల(పామర్రు): పామర్రు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కో–కన్వీనర్ కాకి ప్రవీణ్‌కు ఇటీవల మతృవియోగం జరిగింది. ఈ నేపథ్యంలో శనివారం కైలే అనిల్‌కుమార్ రాపర్ల గ్రామం చేరుకుని కాకి అరుణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రవీణ్‌ను ఓదార్చారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, పార్టీ అండగా ఉంటుందన్నారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు తాడిశెట్టి శ్రీనివాసరావు, పల్లికొండ రత్నకుమారి, వార్డు మెంబరు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీనివాస కల్యాణ గానామృతం




పామర్రు: స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కల్యాణ మండపంలో భక్తుల చేత శ్రీనివాస కల్యాణ గానామృతం శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారికి విశేషంగా పూజలను చేశారు. బొగ్గరపు సుభద్ర, రమాదేవి ఆధ్వర్యంలో శ్రీనివాస గానామృతం జరిపించారు. రాజశేఖర్ విజయలక్ష్మీ, లక్ష్మీనారాయణ దంపతులు పీటలపై కూర్చుని కల్యాణ కార్యక్రమం చేశారు.

ఘనంగా శ్రీచక్ర హోమార్చన



పామర్రు: స్థానిక వల్మీకేశ్వరీ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా రెండో రోజు శనివారం పలు సేవలను ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీ లక్ష్మీ గణపతి సహిత శ్రీ చక్ర హోమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన దాతలు గొర్రెపాటి పుట్లమ్మ కుటుంబ సభ్యులు, లక్ష్మీరెడ్డి దంపతులు, శ్రీనివాసరెడ్డి దంపతులు పూజలను చేశారు.

పింఛన్ల పంపిణీలో జాప్యం



పామర్రు: సామాజిక భద్రత పింఛన్లు పంపిణీలో ఏర్పడిన సాంకేతిక కారణాల సమస్యతో నగదు అందజేత సక్రమంగా జరగక సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులుపడ్డారు. శనివారం ఉదయం ఐదు గంటల నుంచి పింఛన్ల పంపిణీకి విధులకు హాజరైన సచివాలయ ఉద్యోగులు పింఛన్లను పంపిణీలో సర్వర్ పని చేయక పోవడంతో అష్ట కష్టాలు పడ్డారు. ఉదయం 9గంటలకు కూడా సర్వర్ సక్రమంగా పని చేయక పోవడంతో 20 శాతం పంపిణీ కూడా పూర్తి కాక ఇబ్బందులు పడ్డారు. అనంతరం ఉన్నతాధికారుల చొరవతో సర్వర్ పని చేయడంతో సాయంత్రానికి 92 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు.

మహాకుంభమేళాకు గుడివాడ నుంచి ఆర్టీసీ బస్సులు

గుడివాడరూరల్: ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు గుడివాడ ఆర్టీసీ డిపో నుంచి ఈ నెల 4వ తేదీన నాన్ ఏసీ స్లీపర్ బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ శనివారం తెలిపారు. ఏడు రోజుల పాటు సాగే ఈ యాత్రకు ఆసక్తిగల వారు వివరాల కోసం 73829 03299లో సంప్రదించాలని ఆయన కోరారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్ క్రాస్ సొసైటీ చేయూత



కోసూరు(మొవ్వ): మొవ్వ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు గత నెల 31వ తేదీ కోసూరులో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు నిత్యావసరాలను శనివారం అందజేశారు. టార్పాలిన్, సామగ్రి, రగ్గులను తహసీల్దారు కే మస్తాన్ చేతుల మీదగా అందజేశారు. రోటరీ క్లబ్ కూచిపూడి సభ్యులు దుప్పట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కృష్ణా జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కార్యదర్శి భవిరి శంకర్నాథ్, బాలాజీ, మొవ్వ మండల సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు కోనేరు మంజునాథ్, వీఆర్వో నవీన్ రెడ్డి, జిల్లా రెడ్ క్రాస్ కో–ఆర్డినేటర్ హరికృష్ణ పాల్గొన్నారు.

సెలవు రోజు పార్కులోనే..

ఆరోగ్యం.. ఆహ్లాదానికి కేరాఫ్ అడ్రస్‌గా పిల్లల పార్కు

పాఠశాలలకు సెలవు రోజు వచ్చిందంటే పిల్లలు పార్కులో ఆడుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఇక సాయంత్రం అయితే సరే సరి. చిన్నారులతో వారి తల్లిదండ్రులు ఇక్కడికి వచ్చి తమ బిజీ లైఫ్‌లో గంట పాటైనా ఇక్కడ సేద తీరుతుండటం విశేషం



ఊయలలు ఊగుతూ చిన్నారుల కేరింతలు

గుడ్లవల్లేరు: చిన్నారులు సెలవు దొరికితే పిల్లల పార్కుకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. సెల్‌ఫోన్‌తో గడిపే చిన్నారులను కొంత సమయం పార్కులో గడిపేందుకు వారి తల్లిదండ్రులు కూడా ఇష్టపడుతున్నారు. ఆడే ఆటల వలన శరీరం వ్యాయామం చేయటంతో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసం ఏర్పడుతుందని కొందరు తల్లిదండ్రులు ఆలోచిస్తున్నారు. గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో పిల్లల పార్కు ఏడేళ్లగా పిల్లలకు ఆరోగ్యం, ఆహ్లాదం, ఆనందాన్ని పంచుతోంది. ఈ పార్కును 2018లో ఇక్కడ ప్రారంభించారు. ఈ పార్కుకు వల్లభనేని సుబ్బారావు సర్పంచ్‌గా ఉండగా... స్థలాన్ని కేటాయించారు. ఆటల వలన పిల్లలు ఎంతో ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో అప్పటి జిల్లా లయన్స్ సెకండ్ గవర్నర్ వై.పి.సి.ప్రసాద్, జిల్లా లయన్స్ కన్వీనర్ కొసరాజు బాపయ్యచౌదరి చొరవతో ఇంటర్నేషనల్ లయన్స్ నుంచి రూ.8 లక్షలను ఈ పార్కుకు కేటాయించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన ఆట వస్తువులతో ఆడుకుంటున్న పిల్లల ఆనందానికి అవధులు ఉండవంటే అతిశయోక్తి కాదు.



జారుడు బల్లలో చిన్నారులను ఆడిస్తున్న పేరెంట్స్



గ్రిల్స్ ఎక్కుతున్న చిన్నారులు

పిల్లల పార్కు గర్వకారణం



లయన్స్ ద్వారా రాజమండ్రి, ఒంగోలు వంటి ప్రాంతాల్లోనే పిల్లల పార్కులను ఏర్పాటు చేశారు. గుడ్లవల్లేరులో అలాంటి పార్కును ఏర్పాటు చేయటం గర్వకారణం. పాఠశాలల్లో వ్యాయామం లేకపోవటంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతారు. అలాంటి పరిస్థితి ఈ ప్రాంతంలో తలెత్తకుండా ఈ పార్కు ఉపయుక్తమవుతుంది.

– వై.పి.సి.ప్రసాద్, జిల్లా లయన్స్ జిల్లా మాజీ గవర్నర్

వ్యాయామం అవసరం



ఈ రోజుల్లో పిల్లలకు వ్యాయామం ఎంతో అవసరం. పిల్లలు ప్రస్తుతం సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్‌ల బారిన పడి ఒకేచోట కూర్చొని ఆడుకుంటూ మానసికోల్లాసం, శారీరక దారుఢ్యానికి సంబంధించిన ఆటలకు దూరమవుతున్నారు. శరీరానికి వ్యాయామం లేకుండా పోతుంది. సెలవురోజు పార్కుకు తీసుకెళితే చాలా మంచిది.

– నిమ్మగడ్డ శశికళ, గుడ్లవల్లేరు లయన్స్ చైర్మన్

డాక్టరు బాబు కృషి..



పార్కు ఏర్పాటు చేయాలని కూరాడ వెంకటాచలం పంతులు ఈ స్థలాన్ని పూర్వం పంచాయతీకి కేటాయించారు. ఆ స్థలంలోనే పిల్లల పార్కును ఏర్పాటు చేయాలని లయన్స్ జిల్లా కన్వీనర్ దివంగత కొసరాజు వెంకటాద్రిచౌదరి(డాక్టర్ బాబు) కృషి చేశారు. ఆయన చొరవతో పార్కు ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనకు వై.పి.సి.ప్రసాద్ కార్యరూపం దాల్చారు.

– వల్లభనేని సుబ్బారావు, మాజీ సర్పంచ్

ఆటల పోటీల్లో పామర్రు విద్యార్థినుల ప్రతిభ



పామర్రు: గ్రిగ్ మెమోరియల్ బాలికల సబ్ జోన్ ఆటల పోటీల్లో తమ హైస్కూల్ విద్యార్థినులు విజేతలుగా నిలిచారని పామర్రు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఏ ఇందిరాణి పేర్కొన్నారు. స్థానిక ఎస్‌కేఆర్‌ఆర్ జెడ్పీ హైస్కూల్లో విజేతలను శనివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జనవరి 31, ఫిబ్రవరి ఒకటో తేదీన పమిడిముక్కల హైస్కూల్లో జరిగిన ఈ బాలికల సబ్ జోన్ పోటీల్లో అండర్–17 బాలికల విభాగం షటిల్, బ్యాడ్మింటన్ పోటీల్లో విన్నర్స్‌గా, సాఫ్ట్ బాల్‌లో రన్నర్స్‌గా నిలిచారని పేర్కొన్నారు. వీరు త్వరలో జరగబోయే సెంట్రల్ జోన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

రహదారి పనులకు శ్రీకారం



ముదినేపల్లి రూరల్: మండలంలో ప్రధానమైన ఆర్‌అండ్‌బీ రహదారి పనుల నిర్మాణానికి అధికారులు శ్రీకారం చుట్టారు. సింగరాయపాలెం నుంచి వడ్లమన్నాడు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి మండలంలోని సింగరాయపాలెం నుంచి చేవూరు వరకు గోతులమయంగా మారింది. దీంతో సుమారు మూడు కిలోమీటర్ల పొడవు ఉన్న ఈ రహదారి నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరయ్యాయి. చేవూరు నుంచి రహదారి అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు.

సూరపనేని మృతి తీరని లోటు

గుడివాడరూరల్: ఎన్టీఆర్ స్టేడియం కమిటీ జీవితకాల సభ్యుడు సూరపనేని వెంకటరమణ మృతి తీరని లోటని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆవరణలో శనివారం సూరపనేని సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కమిటీ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా యలవర్తి మాట్లాడుతూ వెంకటరమణ జైభారత్ ఇంజినీరింగ్ ఇండస్ట్రీని స్థాపించి వ్యవసాయ పనిముట్లు తయారీలో రాష్ట్రంలోనే అగ్రగామి సంస్థగా నిలిపారన్నారు. స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, సభ్యులు, కోచ్‌లు పాల్గొన్నారు.

చిత్తడి నేలలను రక్షించుకోవాలి

మండవల్లి: చిత్తడి నేలలను రక్షించుకుంటే మానవ మనుగడకు రక్షణ కలుగుతుందని ప్రొఫెసర్ సూదాబత్తుల విజయ్‌కుమర్, ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎల్.స్టాలిన్ భాస్కర రావు అన్నారు. ఆదివారం ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం పురస్కరించుకుని లోకుమూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐక్య వేదిక మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెచ్ఎం వెంకటేశ్వర రావు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఉపాధ్యాయులు అనిల్‌కుమార్, నరసింహారావు, బి.వేణుబాబు, సాయిబాబు, బీవీ జనార్ధన్, టీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ విజయ్‌కుమార్

కోతుల బెడద నుంచి రక్షించరూ..

మొవ్వ: మండలంలోని చినముత్తేవి గ్రామంలో కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా తిష్ట వేసిన కోతులు అందిన ప్రతి ఆహార పదార్థాన్ని తస్కరిస్తున్నాయి. ఇళ్లల్లోకి చొరబడి ప్రతి వస్తువును నాశనం చేయడం, లేదా వెంట తీసుకెళ్లడం చేస్తున్నాయని గ్రమస్తులు వాపోతున్నారు. షాపులు, హోటళ్లు, దుకాణాల్లోకి చొరవడి తినుబండారాలను లాక్కెళ్తున్నాయని, పెరట్లో పండించే కూరగాయలు, అరటి, బొప్పాయి, జామ తదితర చెట్లను నాశనం చేస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమను కోతుల బారి నుంచి కాపాడాలని చినముత్తేవి గ్రామస్తులు వేడుకుంటున్నారు.



చినముత్తేవి ఇళ్ల మధ్య సంచరిస్తున్న కోతుల గుంపులు

ఫెడరేషన్ పోటీలకు కేకేఆర్స్ విద్యార్థి ఎంపిక

గుడివాడటౌన్: తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగే ఆల్ ఇండియా సలంబం ఫెడరేషన్ చాంపియన్ షిప్ పోటీలకు గుడివాడ డాక్టర్ కేకేఆర్స్ గౌతమ్ స్కూల్ విద్యార్థి బి.కార్తికేయ ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థి కార్తికేయను అభినందించారు. విద్యార్థి, కోచ్ ఎన్.వెంకటేశ్వరరావును ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, ప్రశాంతి, ఉపాధ్యాయులు అభినందించినట్లు ఆయన తెలిపారు.

పేదల వ్యతిరేక బడ్జెట్

కైకలూరు: కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదల వ్యతిరేక బడ్జెట్‌గా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు, సీఏ బీవీ రావు అభివర్ణించారు. బడ్జెట్‌పై కార్యాలయంలో శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ వర్గాలకు అనుకూలంగా నిధులు కేటాయించి బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం పేదలను దగా చేసిందన్నారు. నిత్యావసరాల ధరల నియంత్రణకు ఎలాంటి పరిష్కారం చూపకపోవడంతో పాటు ధరల స్థిరీకరణకు నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు.

విద్యార్థులకు అవగాహన

నందివాడ: మండలంలోని రుద్రపాక ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ కార్యక్రమంలో ఎస్ఐ కె.శ్రీనివాస్ శనివారం అవగాహన కల్పించారు. విద్యార్థులకు శారీరక భద్రత, స్వీయ రక్షణ, దినచర్యల్లో ఎదురయ్యే సవాళ్లపై స్పష్టమైన సమాచారాన్ని తెలియజేశారు.

రేపటి నుంచి గంగానమ్మ జాతర



జాతరకు ముస్తాబవుతున్న గంగానమ్మ తల్లి ఆలయం



గంగానమ్మతల్లి

ఈనెల తొమ్మిదో తేదీ వరకు ఉత్సవాలు

పామర్రు: పామర్రు గ్రామంలో వేంచేసియున్న గంగానమ్మ తల్లి జాతర మహోత్సవాలను ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించాలని ఆలయ కమిటీ సభ్యులు తలపెట్టారు. సోమవారం నుంచి తొమ్మిదో తేదీ వరకు రోజూ గ్రామంలోని అన్ని వార్డుల్లో పర్యటించి గ్రామం అంతటా అమ్మవారు ఊరేగింపు నిర్వహిస్తారు. జాతర సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దుతున్నారు. ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు శనివారం మాట్లాడుతూ ఏడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు వస్తారని తెలిపారు. అమ్మవారి ఘటం కుండను, పోతురాజు గడలకు గ్రామోత్సవంలో మేళ తాళాలతో కనక తప్పెట్లతో ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

3 నుంచి కార్యక్రమాలు ప్రారంభం

ఈ నెల 3వ తేదీన తెల్లవారుజామున గంగానమ్మ తల్లిని మేళ తాళాలతో, కనక తప్పెట్లతో ఊరేగింపుగా ఆమె పుట్టినిల్లు అయిన బొమ్మారెడ్డి మధుసూదనరెడ్డి(మునసబుగారి) ఇంటి వద్దకు తీసుకెళ్లి అక్కడ విశేష పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను తీసుకొచ్చి ఆలయంలో అమ్మవారికి అలంకరించి జాతరను ప్రారంభిస్తారు. చివరి రోజైన 9వ తేదీన అమ్మవారు ఆలయ ప్రవేశం జరిగిన తర్వాత భక్తులు తమ మొక్కులను తీర్చుకుంటారు. భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా తగు చర్యలు తీసుకున్నట్లు కమిటీ సభ్యులు బొమ్మారెడ్డి వెంకటరామిరెడ్డి, సభ్యులు శనివారం తెలిపారు. ఆలయంలో సీసీ కెమెరాలను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలీసుల గస్తీ నిరంతరం ఉంటుందని తెలిపారు.

పంటబోదెను పూడ్చేస్తున్నారు..!

తోట్లవల్లూరు: పంట బోదెను తూములతో పూడ్చేస్తున్న ఘటన తోట్లవల్లూరులో జరిగింది. కనకదుర్గమ్మ కాలనీ ఎదురుగా ఇటీవల ఓ రియల్‌ఎస్టేట్ వెంచర్ వెలిసింది. సీఆర్‌డీఏ అనుమతితో సుమారు మూడున్నర ఎకరాల్లో ఏర్పాటైన ఈ వెంచర్‌లో కొద్ది రోజులుగా రోడ్ల అభివృద్ధి, ప్రహరీగోడ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రధాన రహదారికి, వెంచర్‌కు మధ్యలో పంట బోదె ఉంది. ఈ పంటబోదె ద్వారా ఖరీఫ్ సీజన్లో వ్యవసాయ అవసరాలకు సాగునీటి సరఫరా జరుగుతుంది. వరిసాగుకు సాగునీరు, వర్షాకాలంలో ముంపు నీరు పోయేందుకు ఉపయోగపడే పంటబోదెను చిన్నపాటి తూములతో పూడ్చేసే దుశ్చర్యకు రియల్‌ఎస్టేట్ నిర్వాహకులు దిగారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రవికుమర్‌ను వివరణ కోరగా తూముల ఏర్పాటును నిలుపుదల చేయించామన్నారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



పంటబోదెలో ఏర్పాటు చేసిన తూములను పూడ్చేస్తున్న జేసీబీ

ఉచిత వైద్యశిబిరం



వైద్యం చేస్తున్న డాక్టర్ వెంకట్రావు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సి.ఎల్.వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 548మంది రోగులకు వైద్యులు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఆదివారం విజయవాడ కామినేని హాస్పిటల్, విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రి, గుడివాడ హోమియో డాక్టర్ భవాని, హైదరాబాదు మానసిక వైద్య నిపుణుడు డాక్టర్ హరిహర్ వైద్య పరీక్షలు చేయనున్నట్లు డాక్టర్ వెంకట్రావు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

గుడివాడరూరల్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుట్టి హరికుమార్ ఆధ్వర్యంలో లక్ష్మీ కంప్యూటర్స్ సహకారంతో పదో తరగతి చదువుతున్న 103 మంది విద్యార్థినులకు పరీక్షల సామగ్రిని శనివారం అందజేశారు. ఏలూరురోడ్డులోని పాదర్ బియాంకి బాలికల ఉన్నత పాఠశాల్లో విద్యార్థినులకు పరీక్షల నిమిత్తం ఉపయోగపడే వస్తువులు, స్టడీ మెటీరియల్స్‌ను మున్సిపల్ మాజీ ప్రతిపక్ష నాయకుడు లింగం ప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. కేశంశెట్టి అజయ్‌కుమార్, మాకుల సత్యం, కంతేటి హరిబాబు, జాజుల తాతారావు, పాఠశాల హెచ్ఎం జి.జయమ్మ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు



విద్యార్థినులకు సామగ్రి అందజేస్తున్న హరికుమార్

వెంకటేశ్వరుని సన్నిధిలో అన్నసమారాధన

గుడ్లవల్లేరు: డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో స్వామిని దర్శించుకునేందుకు శనివారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు. తొలుత స్వామికి విశేషాభిషేకాలతో పాటు ప్రత్యేక పూజలను వేద పండితులు చేపట్టారు. స్వామి దర్శనానికి అధికసంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్వామివారు సర్వ పుష్పాలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు.



భక్తులకు అన్నసమారాధన

ఉల్లాసంగా హైస్కూల్ వార్షికోత్సవం

ముదినేపల్లి రూరల్: వడాలి జెడ్పీహైస్కూల్ వార్షికోత్సవాన్ని శనివారం ఉల్లాసంగా జరుపుకున్నారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, ఆటలపోటీలు తల్లిదండ్రులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్ఎం వి.ప్రభుదాస్, సీనియర్ ఉపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో మాజీ ఎంపీపీ వీరమల్లు నరసింహారావు, సర్పంచ్ మరీదు దుర్గశ్రీ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

•రేపు విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు

పమిడిముక్కల: శ్రీ రుక్మిణి సత్యభామా సమేత వేణుగోపాల స్వామి దేవస్థానంలో సోమవారం వేణుగోపాలస్వామి, వీరాంజనేయ స్వామి, గోదా అమ్మవారి, గరుడ మూర్తుల విగ్రహ ప్రతిష్టా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు వంశపారంపర్య అర్చకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ఇలా.. రాకపోకలు ఎలా..?



దగ్గుమిల్లి వద్ద రోడ్డుపై గొయ్యి

గుడ్లవల్లేరు: మండలంలోని గుడ్లవల్లేరు – ముదినేపల్లి ప్రధాన రహదారి గోతులమయంగా మారింది. వాహనాల రాకపోకలకే కాదు కనీసం కాలినడకకు కూడా కష్టంగా ఉందని ప్రజలు పేర్కొంటున్నారు. ఈ రహదారిలో కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు మండలం, ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలానికి చెందిన గ్రామాలు ఉన్నాయి. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే ప్రత్యక్ష నరకం కనబడుతోందని, రాత్రి సమయంలో రాకపోకలు సాహసోపేతంగా మారాయని వాహనచోదకులు వాపోతున్నారు. అధికారులు స్పందించి ఈ మార్గంలో కొత్తగా రోడ్డు వేయాలని కోరుతున్నారు.



జేమ్స్‌పేట వద్ద ఏర్పడిన గుంత